ఈనాడు ఒడిశా

ఆదివారం అక్టోబరు 6, 2024 13

500 వంతెనల నిర్మాణం..

గ్రామాలకు రవాణా సౌకర్యం

- అయిదేళ్లలో పూర్తి
- ఈ ఏడాది రూ.1,900 కోట్ల కేటాయింపు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నదులపై వంతెనలు లేక ఇబ్బందిపడుతున్న గ్రామాల ప్రజల అవస్థలు త్వరలో తీరనున్నాయి. దశాబ్దాల కలలు నెరవేరనున్నాయి. అయిదేళ్లలో రాష్ట్రంలో 500 వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.1900 కోట్లు కేటాయించింది. శుక్రవారం రెండు రోజుల ఇంజినీర్ల జాతీయ సదస్సును ప్రారంభించిన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రబినారాయణ్ నాయక్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ నిర్మాణాలు పూర్తయ్యాక వాటి భద్రత, నిర్వహణ తదితర అంశాలపై ఇంజినీర్లు దృష్టి సారించాలని ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేశారు. నిర్మాణ ప్రదేశాలు, డిజైన్లు వంటి వాటికి ప్రాధాన్యమిస్తూ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇవి పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగవుతుందని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు పెరుగుతాయని పేర్కొన్నారు.



తాత్కాలికంగా నిర్మించుకున్న కర్ర వంతెన మీదుగా వెళుతున్న గ్రామస్థులు

ఈ ఏడాది 100 నిర్మాణాలు

గతంలో బిజద సర్కార్ అమలు చేసిన బిజు సేతు యోజనను ఇటీవల భాజపా ప్రభుత్వం సేతుబంధన్ యోజనగా పేరు మార్చిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 100 వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద ఇప్పటికే 2,117 నిర్మాణాలు పూర్తయినట్లు పేర్కొన్న రబినారాయణ్ మరో 1,152 వారధులు నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ఈ విషయమై కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని వీటి డిజైన్లు రూపొందించాల్సి ఉంటుందని వెల్లడించారు. రాష్ట్రంలో ఆదివాసీ, వెనుకబడిన జిల్లాలుగా పేరొందిన రాయగడ, మల్కాన్‌గిరి, కొరాపుట్, నవరంగపూర్, కలహండి తదితర జిల్లాల్లో వేలాది గ్రామాలకు సేతువుల సౌకర్యం లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్న విషయం తెలిసిందే. సాధారణ రోజుల్లో కొన్నిచోట్ల మోకాళ్లు, నడుము లోతు నీటిలో నదులను దాటుతున్న ఆయా గ్రామాల ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, నిత్యావసర సరకుల కోసం అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల గ్రామస్థులే చేయిచేయి కలిపి తాత్కాలిక కర్రలు, తీగ వంతెనలు నిర్మించుకుంటున్నప్పటికీ వర్షాకాలంలో అవి కొట్టుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సర్కార్ తాజా నిర్ణయంతో ఆయా గ్రామాలకు ఊరట లభించనుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



నడుం లోతు నీటిలో నదిని దాటుతున్న విద్యార్థులు

ఇద్దరు బాలల మృతదేహాలు స్వాధీనం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని జగత్‌పూర్ బలిసాహి మహానది ఘాట్‌లో శుక్రవారం సాయంత్రం స్నానాలు చేస్తూ గల్లంతైన ఇద్దరు బాలల మృతదేహాలను వెలికితీశారు. అగ్నిమాపక శాఖ జవానులు గాలించి శనివారం ఉదయం పార్థివదేహాలను గుర్తించారు. వీరిద్దరు బలిట్నాకు చెందిన ఆర్యన్‌సాహు (12), రాజేంద్రనాయక్ (13)లుగా జగత్‌పూర్ పోలీసులు తెలిపారు.

వినతుల స్వీకరణ రెండు వారాలు రద్దు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ నెల 7, 14 తేదీల్లో (సోమవారాలు) ముఖ్యమంత్రి వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ సోమవారం మోహన్‌చరణ్ మాఝి ఇతర పనుల్లో తీరిక లేకుండా ఉంటారు. మళ్లీ సోమవారం దుర్గా పూజల నిమజ్జనాల నేపథ్యంలో వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొనబోరని శనివారం సీఎంఓ వర్గాలు ప్రకటించాయి.

చరిత్రలో నిలిచిన బాజిరౌత్ తెగువ

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సంగ్రామంలో ముక్కుపచ్చలారని బాలుడు బాజిరౌత్ చూపిన తెగువ దేశ చరిత్ర పుటల్లో ప్రముఖంగా నిలిచిందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి అన్నారు. భువనేశ్వర్ జయదేవ్ భవన్‌లో శనివారం బాజిరౌత్ జయంత్యుత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ ఢెంకనాల్ జిల్లా నీలకంఠపూర్‌లో జన్మించిన బాజిరౌత్ 12 ఏళ్లకే ఆంగ్లేయుల తూటాలకు బలై స్వాతంత్ర్య పోరాట యోధులకు స్ఫూర్తి ప్రదాత అయ్యాడన్నారు. బాజిరౌత్ జయంతిని ప్రభుత్వం ఇకపై అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొన్న కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో ఉత్కళీయులు చూపిన తెగువ, ధైర్యసాహసాలు భావితరాలకు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



బాజిరౌత్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న మోహన్. పక్కన ధర్మేంద్ర



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

భక్తులతో శక్తిపీఠాలు కళకళ



కటక్ చండీ



కాకట్‌పూర్ మా మంగళ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: చండీ స్తోత్ర పారాయణాలు, షోడశోపచార పూజలతో రాష్ట్రంలోని శక్తిపీఠాలు అలరారుతున్నాయి. భక్తులతో ఆలయాలు కళకళలాడుతున్నాయి. శనివారం ఆశ్వీయుజ శుక్లపక్షమి తృతీయ తిథిని పురస్కరించుకుని కటక్ చండీని దుర్గతి నాశిని రూపంలో అలంకరించారు. పూరీలోని కాకట్‌పూర్ మామంగళ అమ్మవారు శాంభవి రూపంలో అలరించింది. జాజ్‌పూర్ బిరజా, బాణపూర్ భగవతి, సంబల్‌పూర్ శామలాయి, ఘటగాం తారిణి తదితర శక్తి పీఠాల్లోనూ శరన్నవరాత్రుల వేడుకలు కొనసాగుతున్నాయి.

కుంకుమార్చనలు.. విశేష పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని వివిధ మందిరాలు, పలు సంస్థల ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో శనివారం నీలకంఠనగర్ హౌసింగు బోర్డులోని వేదమాత గాయత్రీదేవి మందిరం, ఖస్పావీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం, జటాధరేశ్వరస్వామి ఆలయం ఆవరణలోని సంతోషిమాత దేవాలయం, డైమండ్ ట్యాంకు రోడ్డులోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మందిరం తదితర చోట్ల విశేష పూజలు, అభిషేకాలు, సామూహిక పారాయణాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు.



ఖస్పావీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మహిళల సామూహిక లలితా సహస్ర నామ పారాయణం



ఆర్య వైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు

ఖాతాలో నగదు మాయం



భర్తతో దాసరి సబర

గుణుపురం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలకు సంబంధించిన నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నాయి. ఆ మొత్తాలను వారు అవసరాలకు వినియోగించుకుంటారు. దీనికి భిన్నంగా గుణుపురంలో గిరిజన మహిళ బ్యాంకు ఖాతాలో ఆవాస్ యోజన కింద జమయిన నగదు మాయమైంది. వివరాల్లోకి వెళ్తే చిన్నాసరి పంచాయతీ పెరండా గ్రామానికి చెందిన దాసరి సబర అనే మహిళ పేరు మీద ఆవాస్ యోజన కింద ఇల్లు మంజూరైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.2 లక్షలు (లక్షా ఇరవై వేలు) మంజూరు చేసింది. గుణుపురం ఉత్కళ గ్రామీణ బ్యాంకు ఖాతా ఆ మొత్తం జమైంది. గతంలో రూ.73 వేలు నగదు తీశారు. మూడు రోజుల కిందట డబ్బు కోసం దంపతులు బ్యాంకుకు వెళ్లగా రూ.36,400లను ఆగస్టు నెలలో 20వ తేదీ నుంచి 24 వరకు నాలుగుసార్లు తీసినట్లు సదరు ఉద్యోగి తెలపడంతో వారు లబోదిబోమన్నారు. తాము నగదు తీయలేదని భోరున విలపించారు. ఆమె వద్ద చరవాణి లేదు. ఎక్కడా సంతకం, వేలి ముద్రలు వేయలేదని చెప్పింది. ఎలా డబ్బు మాయమైందని దంపతులు వాపోయారు. దీనిపై బ్యాంకు మేనేజరుకు తెలియజేశారు. పుటాసింగి పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రహదారి లేక.. తప్పని కాలినడక

అత్యవసర సమయంలో అవస్థలు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: దశాబ్దాలు గడిచినా జిల్లాలో మారుమూల గ్రామాల దుస్థితి మారడం లేదు. నేటికీ రహదారులు లేక గ్రామాల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాలకులు, యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. 7,073 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల రాయగడ జిల్లాలో 11 సమితిలు, 182 పంచాయతీలు, 2,672 గ్రామాలున్నాయి. వీటిలో దాదాపు 560 గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేదు. ఇందులో అత్యంత వెనుకబడిన కాశీపూర్, చంద్రపూర్ మారుమూల సమితిల్లో గ్రామాల పరిస్థితి అధ్వానంగా ఉంది. కాశీపూర్ సమితిలో 26 పంచాయతీలు, 400 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 80 గ్రామాలకు రహదారి లేని దుస్థితి. సమితి అభివృద్ధి అధికారి జిల్లా పాలనాధికారికి ఇటీవల అందించిన నివేదికలో పేర్కొన్నారు. పక్కా రహదారులు లేక ప్రతిరోజు కాలినడకనే రాకపోకలు సాగిస్తున్నారు. రోగులు, గర్భిణులు నానా అవస్థలు పడుతున్నారు. సరైన మార్గం లేక నదులపై వంతెనలు లేకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రవాహాన్ని దాటుతున్నారు. గర్భిణులు సకాలంలో ఆసుపత్రులకు చేరుకోలేక మార్గమధ్యలో ప్రసవించిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై రాయగడ శాసనసభ్యుడు అప్పలస్వామి కద్రక మాట్లాడుతూ 25 ఏళ్ల బిజద పాలనలో కాశీపూర్ వంటి ప్రాంతాల్లో రహదారులు నిర్మించకపోవడం విచారకరమన్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఈ సమస్యను ప్రస్తావించానని తెలిపారు. పూర్తిస్థాయి మార్గాలు నిర్మించాలని ప్రభుత్వానికి ఆయన విన్నవించారు.



రహదారిలేక రైలు పట్టాలు దాటుతున్న గ్రామస్థులు (పాత చిత్రం)



గ్రామాల్లో రహదారుల దుస్థితి




గర్భిణిని నది దాటిస్తున్న గ్రామస్థులు (పాత చిత్రం)

వేసవిని తలపిస్తున్న ఎండలు

రాష్ట్రంలో ఎండలు మండు వేసవిని తలపిస్తున్నాయి. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు భానుని తీవ్రత భయపెడుతోంది. కాలవైశాఖి (థండర్ స్టార్మ్) ప్రభావంతో అక్కడక్కడా ఒక మోస్తరు జల్లులు పడుతున్నాయి. గడిచిన వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొంది.

గోపాలపూర్, న్యూస్‌టుడే





పూరీలో శనివారం ఉదయం 11 గంటలకు ఇలా..

ద్రోణి ప్రభావం శూన్యం

బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ సరిహద్దు తీరంలో 4వ తేదీన ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం రాష్ట్రంపై కనిపించలేదు. 6న మరో పీడనం ఏర్పడుతుందన్న వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) అంచనా తల్లకిందులైంది. తాజా అధ్యయనం ప్రకారం బంగాళాఖాతంలో రానున్న అయిదు రోజుల వరకు ఆవర్తనాలు ఏర్పడే సూచనలు లేవని గోపాల్‌పూర్ ఐఎండీ కేంద్రం అధికారి కె.ఎస్.మూర్తి శనివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. దసరా వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే సూచనలు లేవన్నారు. వాయు మండలంలో ఆర్ద్రత పెరగడంతో ఉక్కపోత తీవ్రంగా ఉందని, ఇది కొనసాగుతుందన్నారు. థండర్ స్టార్మ్ ప్రభావం ఉంటుందని, అక్కడక్కడా జల్లులకు అవకాశం ఉందని మూర్తి తెలిపారు.

నేడు ఈ జిల్లాల్లో కాలవైశాఖి వర్షాలు

ఆదివారం మల్కాన్‌గిరి, కొరాపుట్, రాయగడ, నవరంగపూర్, కలహండి, గజపతి, కేంఝర్, మయూర్‌భంజ్, బాలేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రపడ జిల్లాలపై కాలవైశాఖి(థండర్ స్టార్మ్) ప్రభావం ఉంటుందన్నారు. అక్కడక్కడా ఒక మోస్తరు వర్షాలకు అవకాశముందని, తరువాత మూడు రోజులు(9 వరకు) వాతావరణం పొడిగా ఉంటుందన్నారు.

గోపాల్‌పూర్ ఐఎండీ కేంద్రం అధికారి కె.ఎస్.మూర్తి శనివారం 'న్యూస్‌టుడే'కు తెలిపిన ఉష్ణోగ్రత, ఆర్ద్రత వివరాలు

కేంద్రం	ఆర్ద్రత
కేంద్రపడ, జగత్సింగ్‌పూర్	72
జాజ్‌పూర్, ఢెంకనాల్	68
అనుగుల్, బాలేశ్వర్, భద్రక్	66
గోపాల్‌పూర్, పూరీ, ఖుర్దా	64
నయాగఢ్, కటక్	63

కేంద్రం	ఉష్ణోగ్రతలు డిగ్రీల్లో
జగత్సింగ్‌పూర్, పర్లాఖెముండి	37.0
భువనేశ్వర్	35.6
కటక్	34.4
ఝార్సుగుడ, సంబల్‌పూర్	34.2
సుందర్‌గఢ్, రవుర్కెలా	34.1
బొలంగీర్, భవానీపాట్నా	34.0
కేంద్రపడ, బాలేశ్వర్, భద్రక్	33.9
పూరీ, గోపాల్‌పూర్	33.0

రైతుల ఖాతాల్లో నగదు జమ

రాయగడ, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా జిల్లాలో 42,032 మంది రైతుల ఖాతాలో నేరుగా రూ.2 వేలు చొప్పున నగదు జమయినట్లు జిల్లా పాలనాధికారి పరుల్‌పట్వారి తెలిపారు. శనివారం జిల్లాపరిషత్ సమావేశ భవనంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహారాష్ట్రలో లబ్ధిదారులకు ఈ పథకం కింద నగదు విడుదల చేసే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేశారు. జిల్లాలో అత్యధికంగా కాశీపూర్ సమితిలో 5,958, అత్యల్పంగా చంద్రపూర్‌లో 2,128 మంది లబ్ధిదారులు ఉన్నారు. దీని ద్వారా ప్రతి రైతు ఖాతాలో మొత్తం రూ. 6 వేలు ఏడాదికి జమవుతుందని, రాష్ట్రం అమలు చేస్తున్న సీఎం కిసాన్ యోజన కూడా ఆర్థిక సహాయమవుతుందని తెలిపారు. జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి బిష్ణుప్రసాద్‌ఖరో, జిల్లాస్థాయి అధికారులు, రైతన్నలు పాల్గొన్నారు.



వేదికపై పాలనాధికారి పరుల్‌పట్వారీ



హాజరైన రైతన్నలు, అధికారులు

నవీన్ నిగ్రహం కోల్పోతున్నారు

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాజకీయ పార్టీలకు ఉత్థానపతనాలుంటాయని, అధికారం ఏ పార్టీకీ శాశ్వతం కాదన్న వాస్తవం బిజద అధినేత నవీన్ పట్నాయక్ విస్మరిస్తున్నారని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. శనివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 25 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించి ఏమీ చేయలేకపోయిన నవీన్ 100 రోజుల భాజపా ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఒడిశా నుంచి పార్లమెంటులో భాజపాకు రెండు స్థానాలున్నప్పుడు కొన్ని పార్టీలు తమను 'సైన్‌బోర్డు' పార్టీగా ఎద్దేవా చేసిన సంగతిని ఆయన గుర్తు చేశారు. జనాదరణ తమకే ఉందని విర్రవీగిన నవీన్‌కు ప్రజలు విపక్ష హోదా కట్టబెట్టారని, తన బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేకపోతున్న ఆయన అధికారంలో ఉన్నవారిపై విమర్శలకే పరిమితం కావడం పెద్దరికం కాదన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, పనులు చేస్తుందని, ఇందులో ఎలాంటి సందేహాలు లేవన్నారు. ప్రజలు రానున్న అయిదేళ్లలో అభివృద్ధి చూస్తారన్నారు.



బాజిరౌత్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కేంద్రమంత్రి

బాజిరౌత్ అమరజీవి

దీనికి ముందుగా అమర బాజిరౌత్ జయంతి వేడుకలో పాల్గొన్న ధర్మేంద్ర ఆ స్వాతంత్ర్య సమరయోధుని విగ్రహానికి పుష్ప గుచ్ఛం వేసి అంజలి ఘటించారు.

మళ్లీ అధికారం తథ్యం

హరియాణ ప్రజలు మళ్లీ భాజపాకు పట్టం కడుతున్నారని, ఎన్నికల ప్రచారం చేసిన తాను ఓటర్ల ఉత్సాహం గమనించినట్లు ధర్మేంద్ర చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం ఉందన్నారు.

దిగజారుడు రాజకీయాలు తగవు

బిజద విలువలకు సమాధి కడుతోందని, ఆ పార్టీ నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. శనివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజ్‌భవన్‌లో గవర్నరును మర్యాదపూర్వకంగా కలుసుకోవడానికి వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడుపై విమర్శలు చేయడం అత్యంత దురదృష్టకరం, నిందనీయమన్నారు.

అమ్మ పేరిట మొక్క

అనంతరం కేంద్ర మంత్రి భువనేశ్వర్ డీఏవీ స్కూలు ఆవరణలో 'అమ్మ పేరిట మొక్క' కార్యక్రమంలో పాల్గొని భాజపా నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్రమోదీ 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరిట మొక్క నాటాలన్న సందేశం ప్రతిఒక్కరు అమలుపరచాలన్నారు.



మొక్క నాటుతున్న ధర్మేంద్ర

బ్రహ్మపురలో రాష్ట్ర యోగాసనాల పోటీలు

పోటీ పడుతున్న 12 జిల్లాల క్రీడాకారులు



స్వరూపా సాహు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా యోగా సంఘం సహకారంతో గంజాం జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మపురలో 30వ రాష్ట్రస్థాయి యోగాసనాలు, క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఖస్పావీధిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వీటిని బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రెండురోజులు కొనసాగనున్న ఈ పోటీల్లో గంజాం, ఖుర్దా, కటక్, మయూర్‌భంజ్, బరగఢ్, కేంద్రపడ, పూరీ, బాలేశ్వర్, బొలంగీర్, నవరంగపూర్, నయాగఢ్, సంబల్‌పూర్ జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఎనిమిదేళ్ల నుంచి 35 ఏళ్ల వయసువారు వివిధ యోగాసనాలు వేసి ఉత్సాహంగా పోటీపడ్డారు. రాష్ట్ర యోగా సంఘం అధ్యక్షుడు భక్తబల్లవ దాస్, కార్యదర్శి సీతారాం శర్మ, ఉపాధ్యక్షులు అనంగమోహన్ ద్వివేది, సత్యజిత్‌మహంతి, కోశాధికారి సునీల్‌కుమార్ అగర్వాల్ తదితరులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన యోగా శిక్షకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో గెలుపొందిన విజేతలు ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న 49వ జాతీయ యోగాసనాల పోటీల్లో పాల్గొంటారని కార్యదర్శి శర్మ చెప్పారు.



రాయ్‌శ్రీచాందినీ శ్రీచందన్



బిభందక సాహు

పరమేశ్వరి నమోస్తుతే

శరన్నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు శనివారం పలు ఆలయాల్లో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండపాల్లో కొలువైన దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జగన్మాతకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

–న్యూస్‌టుడే, బృందం



నవరంగపూర్: అయోధ్య రామాలయాన్ని తలపిస్తున్న బస్టాండు సమీపంలో మండపం



గుణుపురం: అన్నపూర్ణ అవతారంలో ముత్యాలమ్మ అమ్మవారు



బ్రహ్మపుర: గాయత్రీ దేవి అవతారంలో చౌడేశ్వరి అమ్మవారు



రాయగడ: పళ్ల రసాలతో అమ్మవారికి అభిషేకం



పర్లాఖెముండి: దుబ్బఖంజా వీధి వద్ద పూజలు అందుకుంటున్న పరమేశ్వరి

మాది ప్రజల ప్రభుత్వం



వేదికపై ప్రసంగిస్తున్న మోహన్, ఇతర ప్రముఖులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం మీడియా గొంతు నులిమింది, అనుకూలంగా లేని చానెళ్లు, పత్రికలకు ప్రకటనలు ఆపేసిందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పేర్కొన్నారు. శనివారం భువనేశ్వర్‌లో 'నిర్భయ' వార్తా పత్రిక 10వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నవీన్ పాలనాకాలంలో శాసనసభ, లోక్‌సేవాభవన్(సచివాలయం)కు పాత్రికేయులను రానీయ లేదన్నారు. ఒకవిధంగా చెప్పాలంటే మీడియాకు సంకెళ్లు వేయించారన్నారు. ప్రజల సేవలకు అంకితమైన తమ ప్రభుత్వం పత్రికలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని, సద్విమర్శలకు ఆహ్వానిస్తోందన్నారు. కార్యక్రమంలో నిర్భయ ప్రధాన సంపాదకుడు నవీన్‌దాస్, సంబాద్ గ్రూపు సంస్థల అధ్యక్షుడు సౌమ్యరంజన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ పోటీల విజేత ఆహాన్



బహుమతులతో ఆహాన్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన నాలుగోవ గణేశ్వరమిత్ర ఐటా-ఓటీఏ ఛాంపియన్‌షిప్ సిరీస్, అండర్-16, 18 టెన్నిస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. భువనేశ్వర్ కళింగ మైదానంలో టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరిగిన పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి ఆహాన్ డబుల్ క్రౌన్ బహుమతులు గెలుచుకుంది. సింగిల్స్ తుది పోరులో అండర్-16 విభాగంలో 6-1, 6-0 సెట్లతో ఆరాధ్య (ఒడిశా)పై, అండర్-18లో 6-2, 6-0 సెట్లతో ప్రార్థనా మండల్ (పశ్చిమబెంగాల్)పై గెలుపొంది ఛాంపియన్‌గా నిలిచింది.



క్రీడావిభాగం అధికారులతో తొరాయి

ఆసియా పెన్‌కాక్ సిలెట్‌లో రాష్ట్ర క్రీడాకారిణి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఉజ్బెకిస్థాన్‌లో ఈ నెల 9 నుంచి 16 వరకు జరగనున్న 8వ ఆసియా సీనియర్ పెన్‌కాక్ సిలెట్ పోటీలకు రాష్ట్ర క్రీడాకారిణి ఎంపికైంది. ఈమేరకు రాష్ట్ర క్రీడావిభాగం 'ఎక్స్'లో ఆ వివరాలు వెల్లడించింది. పోటీలకు వెళ్లే భారత జట్టులో రాష్ట్రానికి చెందిన ప్రిజలిన్ తొరాయి స్థానం పొందినట్లు అందులో పేర్కొంది.

గ్రామీణస్థాయి వాలీబాల్ పోటీలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: గ్రామీణస్థాయి వాలీబాల్ పోటీలు హిందాల్కో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు కంటగుడ క్రీడామైదానంలో ఈ ఆటలు జరుగుతాయి. సంస్థ ఏజీఎం ప్రతాప్‌కుమార్‌పాత్రో, మేనేజర్ ప్రకాష్‌కుమార్ సాహు, సీఎస్ఆర్ మేనేజర్ సంతోష్‌పట్నాయక్ తదితరలు పాల్గొన్నారు. మొత్తం 52 జట్లలో తొలి రోజు 20 తలపడ్డాయి. రైసింగ్ స్టార్ క్లబ్ సభ్యులు పోటీలకు నాయకత్వం వహిస్తున్నారు.



క్రీడాకారులతో ప్రతాప్

డీఆర్ఎం పర్యటన



దమన్‌జోడిలో పనుల పరిశీలన

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో వాల్తేరు డివిజన్ రైల్వే డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ శుక్రవారం సాయంత్రం పర్యటించారు. కిరండోల్-కొత్తవలస, కొరాపుట్-రాయగడ మార్గంలో వివిధ రైల్వేస్టేషన్‌నలను పరిశీలించి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. రైల్వే రెస్క్యూ, వైద్య బృందాలు మెరుగ్గా పనిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డీఆర్ఎం విలేకర్లతో తెలిపారు.

నరేష్‌చంద్రసాహుకు రక్తవీర్ పురస్కారం



సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా దమన్‌జోడికి చెందిన సరస్వతి విద్యా మందిర్ అధ్యాపకుడు, జిల్లా యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ నరేష్‌చంద్రసాహుకు రక్తవీర్ రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో రెడ్‌క్రాస్ భవనంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రక్తదాన శిబిరాలు నిర్వహణ, చైతన్యం కలిగించే సంఘ సేవకులకు సత్కరించారు. వీరితో పాటు నరేష్‌కు పురస్కారం అందజేశారు. పోలీసు డీసీపీ లాలిటెండు మహంతి, యూత్ రెడ్‌క్రాస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుదీప్ సాహుకు సత్కారం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: జిల్లా విలేకరుల సంఘం గంజాం శాఖ నూతన అధ్యక్షుడిగా సీనియరు జర్నలిస్టు సుదీప్ కుమార్ సాహు ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక 'సురభి' స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక గొయిలుండిలోని సత్కారం జరిగింది. పలువురు సంస్థ మహిళలు పాల్గొని సాహును సత్కరించి, అభినందించారు.



సుదీప్ సాహును సత్కరిస్తున్న సురభి సంస్థ ప్రతినిధులు

పేపరుమిల్లు యూనియన్ అధ్యక్షుడిగా అమన్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పేపరుమిల్లు మూడో సంఘం యునైటెడ్ బిల్ట్ సేవా వర్కర్స్ యూనియన్ వార్షిక సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా జాతీయ పేపరు ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు సుధాంశు శేఖర్ పాఢి, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఎ.భీమారావు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షుడుగా అమన్ ఉజ్‌బిన్ నాయక్, ఉపాధ్యక్షుడుగా భగవాన్ చౌదరి, ఎడిటర్ రబినారాయణశెఠి ఎంపికయ్యారు.

బ్రహ్మపురలో 'దాండియా' సందడి

నృత్యాలు, పాటలతో ఉర్రూతలూగించిన మహిళలు



దాండియా నృత్యాలు చేస్తున్న యువతులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: దాండియా ఆటలు.. సరదా పాటలతో ఆ ప్రాంగణం సందడిగా మారింది. యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని కేరింతలు కొట్టారు. ఇవన్నీ శుక్రవారం రాత్రి జరిగిన బ్రహ్మపుర ఇన్నర్‌వీల్ క్లబ్ వేడుకలు. దసరా ఉత్సవాల్లో భాగంగా క్లబ్ తరఫున ధర్మనగర్‌లోని శుభం సెలబ్రేషన్స్‌లో 'బాలీవుడ్ డిస్కో దాండియా' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు, యువతులు దాండియా సంప్రదాయ దుస్తులతో ముస్తాబయి నృత్యాలు చేశారు. తొలుత దుర్గమ్మ తల్లికి పూజలు జరిపిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కోల్‌కతాకు చెందిన బాలీ బాయ్స్ బృందం డీజే పాటలు, వ్యాఖ్యానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకల్లో ఉత్తమ దాండియా ప్రిన్సెస్‌గా నూపూర్ పాత్ర, ఉత్తమ దాండియా క్వీన్‌గా సిమ్రాన్ సేనాపతి, ఉత్తమ వస్త్రధారణకుగాను భాగ్యం బెహరా తదితరులు వివిధ కేటగిరీలలో బహుమతులందుకున్నారు. క్లబ్ అధ్యక్షురాలు జె.సుధారాణి, కార్యదర్శి సాకా శిరీష, ప్రాజెక్టు అధ్యక్షులు గౌరీపాత్ర్, అపర్మిత మంగరాజ్, శశ్మిత సేనాపతి విజేతలకు బహుమతులతోపాటు నగదు పారితోషికం అందజేశారు.



జగన్నాథుని సన్నిధిలో సామల్ పూజలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ శనివారం పూరీ వెళ్లారు. శ్రీక్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో పూజలు చేశారు.

ఆశా కార్యకర్తల డిమాండ్



మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా ఆశా కార్యకర్తల సంఘం తరపున పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రధానమంత్రి పేరిట పాలనాధికారి ఆశిష్ ఈశ్వర్‌పాటిల్‌కి అందజేశారు.

గజపతి జిల్లాలో పరిశ్రమలు



హస్తిన సదస్సులో డా॥ పాణిగ్రహిని సత్కరిస్తున్న ముఖ్యమంత్రి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పరిశ్రమలు లేని గజపతి జిల్లాలో త్వరలో రెండు నిర్మాణాలు జరగనున్నాయి. హస్తినలో జరిగిన ఉత్కర్ష ఒడిశా సదస్సులో పాల్గొన్న హైటెక్ గ్రూపు సంస్థల అధ్యక్షుడు డాక్టర్ తిరుపతి పాణిగ్రహి పవన్‌భారత్ అల్యూమినా ఇండస్ట్రీ ఈ జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి వీలుగా కృషి చేశారు. ఈ గ్రూపు సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిందని పాణిగ్రహి శనివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. 600 మందికి ఉపాధి అవకాశాలుంటాయన్నారు. గజపతిలో జగదీష్ ప్రాన్ ఎక్స్‌పోర్ట్ (రొయ్యల ఎగుమతి) సంస్థ ఉత్పత్తుల ఎగుమతి కేంద్రం ఏర్పాటుకు అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. ఉత్కర్ష ఒడిశా సదస్సులో పాల్గొన్న పాణిగ్రహికి ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సత్కరించారు.

అంతరిక్షంపై విద్యార్థులకు అవగాహన



యువ శాస్త్రవేత్త డాక్టర్ స్వయిన్‌ను స్వాగతిస్తున్న విద్యార్థులు, బోధకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో ఖొల్లింగిలోని ప్రాథమికోన్నత పాఠశాల, కొంకరడలోని విజ్ఞాన కళాశాలల్లో శనివారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా 'శాంతి స్వరూప్ భట్నాగర్' అవార్డు అందుకున్న జిల్లాకు చెందిన యువ శాస్త్రవేత్త డాక్టర్ దిగేంద్రనాథ్ స్వయిన్ పాల్గొన్నారు. ఆయన అంతరిక్షం, పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు ఆయనకు ఆయా చోట్ల విద్యార్థులు, బోధకులు ఘన స్వాగతం పలికారు.

వరద ప్రభావిత ప్రాంతంలో వైద్య శిబిరం



ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: వరద ప్రభావిత ప్రాంతమైన ఖరగ్‌పూర్ సబ్‌డివిజన్ డేబ్రాలో ఖరగపూర్ రెడ్ వాలంటరీ దక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

అందిస్తున్న వైద్య సేవలు

ప్రవేశాల కరపత్రాలు-2025 విడుదల

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి ఆర్.సీతాపురం వద్దనున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రవేశాల కరపత్రాలు-2025ను విడుదల చేశారు. వర్సిటీ ఉపాధ్యక్షులు డి.ఎన్.రావు, ఉపకులపతి డా. సుప్రియ పట్నాయక్, అకాడమిక్ కులపతి డా. బిశ్వజిత్‌మిశ్ర తదితరలు పాల్గొన్నారు. ప్రవేశాల డైరెక్టర్ సుశాంత్‌పరిడా వివిధ కోర్సుల వివరాలను తెలియజేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

సమస్యలు పరిష్కరించేందుకు కృషి



మాట్లాడుతున్న లోక్‌సభ సభ్యుడు ప్రదీప్‌కుమార్ పాణిగ్రహి, తదితరులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన సమితి పంచాయతీ కార్యాలయంలో సమితి అధ్యక్షుడు రంజీవ్‌సబర్ అధ్యక్షతన శనివారం సమితి 7వ సాధారణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి లోక్‌సభ సభ్యుడు ప్రదీప్ పాణిగ్రహి, శాసనసభ్యుడు దాశరథి గమాంగ్, బీపీఓ రాజీవ్‌దాస్, జడ్పీ ఉపాధ్యక్షురాలు కుంతల మల్లిక్ తదితరులు పాల్గొన్నారు. దాశరథి మాట్లాడుతూ సమితిలోని 39 పంచాయతీల్లో సమస్యలను వివరించారు. ప్రదీప్ పాణిగ్రహి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బాణసంచా కాల్పులపై నిషేధం... భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ దసరా వేడుకల్లో ప్రధాన ఆకర్షణ బాణసంచా కాల్పుల పోటీలు. మహానది బాలిజాతర మైదానంలో రావణ దహనం వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతాయి. పూజా సంఘాలు పోటాపోటీగా బాణసంచా కాల్చుతాయి. విజయదశమి రోజున ఏర్పాటయ్యే రావణ దహనానికి ఎంతో ప్రత్యేకత ఉంది. వేడుక కోసం ఇదివరకే సన్నాహాలు ఆరంభం కాగా, శనివారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. బాణసంచా కాల్పుల పోటీలు నిషేధించింది. కాలుష్యానికి తావులేని విధంగా చర్యలు తీసుకోవాలని కటక్ జిల్లా యంత్రాంగానికి, కటక్ నగరపాలక సంస్థను ఆదేశించింది.

సాంస్కృతిక సంబరాలు యథాతథం....: దసరా వేడుకలు మత సామరస్యానికి ప్రతీక కాగా ఈ సాంస్కృతిక బంధంలో భాగంగా రావణ దహనం వేడుకపై న్యాయస్థానం ఎలాంటి ఆంక్షలు విధించలేదు. ఈ ఉత్సవం కొనసాగించాలని సూచించింది. కేవలం బాణసంచా కాల్పులు చేపట్టరాదని మాత్రమే స్పష్టం చేసింది.

భోజన శాలలో తనిఖీలు... పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఆహార భద్రత, పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా శనివారం మోహన సమితిలోని పలు భోజన శాలల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో అదనపు పౌర సరఫరాల శాఖ అధికారి బిష్ణుచరణ్‌పరిడా, ఆహారభద్రత ఇన్‌స్పెక్టర్ తపస్విని బెహరా తదితరులు పాల్గొన్నారు.

జియోతో మంచి భవిత... సిమిలిగుడ, న్యూస్‌టుడే: విద్యార్థులు జియో సంస్థ ద్వారా మంచి భవితను మలుచుకోవాలని జియో ప్రాంతీయ మేనేజర్ రష్మీరంజన్ దాస్ కోరారు. సిమిలిగుడ ప్రభుత్వ కళాశాలలో జియో డిజిటల్ ద్వారా శనివారం వ్యక్తిత్వవికాసం, ఉజ్వల భవిష్యత్ కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. రమారంజన్ పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్ పట్టణ విద్యాసాగర్ స్మృతి మందిరంలో నృత్య శిక్షణా కేంద్రం నృత్య నీడ్ 50వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బస్సు ఢీకొని ఏడాదిన్నర బాలుడు మృతిచెందిన ఘటన రాయగడ జిల్లా బిసంకటక్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్ పరిధి కంకుబడి పంచాయతీ కొటింగ గ్రామానికి చెందిన జోగిహికాక కుమారుడు సాయిరాం తమ ఇంటి ముందు ఆడుకుంటుండగా బస్సు ఢీకొంది. తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలో మృతిచెందాడు. బాలుడి తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభిస్తున్నారు.

గొచ్చాపడ ఘటనపై క్రైంబ్రాంచ్ దర్యాప్తు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా గొచ్చాపడ ఠాణా పరిధిలోని డాంగసంబు ఘాటీ మార్గంలో ఇటీవల బౌద్ధ్ జిల్లా కంటమాల్ ఠాణా పరిధిలోని బెహరపడ గ్రామానికి చెందిన జ్యోష్ట బదంగి అనే వ్యక్తి మృతదేహం లభించిన సంగతి తెలిసిందే. పోలీసులే ఆయనను కొట్టి చంపారని బదంగి భార్య ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసు అధికారులు శిక్షణలో ఉన్న ఎస్సై, హవల్దారులను సస్పెండు చేశారు. మరో ముగ్గురు హోంగార్డులను తొలగించిన సంగతి విదితమే. సున్నితమైన ఈ అంశంపై క్రైంబ్రాంచ్ ద్వారా దర్యాప్తు జరపాలని డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్పీ రజత్ కుమార్ రేను దర్యాప్తు అధికారి (ఐఓ)గా నియమిస్తూ ఆ ఉత్వరులో పేర్కొన్నారు. దీనితో డీఎస్పీ రే మధ్యాహ్నం డాంగసంబు ఘాటీలో మృతదేహం లభించిన ప్రాంతానికి శాస్త్రీయ బృందంతో చేరుకున్నారు.

ఇంట్లో చొరబడి దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని పారినువాగావ్ గ్రామంలో శుక్రవారం రాత్రి బిప్ర ప్రధాన్ అనే వ్యక్తి ఇంట్లోకి ఆరేడుగురు బలవంతంగా ప్రవేశించి ఆయనపై మారణాయుధాలతో సామూహికంగా దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడ్డ ప్రధాన్‌ను కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఆసుపత్రిలో బాధితుడు ప్రధాన్‌తో మాట్లాడి వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఫిషింగ్ క్యాట్ మృతి



రహదారిపై పడి ఉన్న ఫిషింగ్ క్యాట్ కళేబరం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా గొళంత్రా ఠాణా పరిధిలోని భలియాగడ వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని 'ఫిషింగ్ క్యాట్' మృతి చెందింది. సమాచారం అందుకున్న బ్రహ్మపుర అటవీ రేంజ్ సిబ్బంది అక్కడకు చేరుకుని దాని కళేబరాన్ని స్వాధీనం చేసుకుని పరీక్షకు తరలించారు.

నదిలో మునిగి ఊపిరొదిలిన యువకుడు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండలో ఓ యువకుడు చేపలు వేటకు వెళ్లి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే శనివారం ఉదయం బడపడా పంచాయతీ ఖజరిగుమ్మా గ్రామానికి చెందిన బలరాం హంతాల్ నదిలో చేపలు పట్టేందుకు పడవలో వెళ్లాడు. అదుపు తప్పి పడవ బోల్తా పడడంతో నీటిలో మునిగిపోయాడు. స్థానికులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరీక్షకు పంపారు.

విద్యుదాఘాతంతో ఆవులు మృత్యువాత

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణంలో విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతిచెందాయి. ఖరగ్‌పూర్‌లో మలంచా హితకారిణి పాఠశాల సమీపంలో చెత్తకుండీలో ఆకులు తీనేందుకు వెళ్లాయి. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో తీగలు తాకి ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: అక్రమంగా గంజాయి రవాణా చేసి పరారీలో ఉన్న నిందితుడు పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే గత ఏప్రిల్ నెలలో బలిమెల ఠాణా సోమనాధపూర్ పంచాయతీ నువాగుడ గ్రామానికి చెందిన కరన్ శిశా అనే వ్యక్తి ఇంట్లో గంజాయి ఉందని సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోగా, కరన్ పరారయ్యాడు. శుక్రవారం నిందితుడు కుడుములుగుమ్మ గ్రామంలో జరుగుతున్న వారపు సంతలో ఉన్నట్లు తెలిసిన సమాచారంతో కరన్‌శిశాను అరెస్టు చేశారు. శనివారం న్యాయస్థానానికి తరలించినట్లు బలిమెల ఠాణా అధికారి ధిరేన్‌పట్నాయక్ సూచనలు అందజేశారు.

కేంద్ర పథకాలతో గ్రామాల్లో ప్రగతి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలతో అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని కేంద్ర పర్యావరణ పరిశోధక అధికారులు శశియప్పన్, సలీం కుమార్ సూచించారు. మండలంలోని ఎల్ఎన్‌పురం పంచాయతీ పరిధిలో పర్యటించారు. వివిధ శాఖల ఇంజినీరింగు అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. గృహ నిర్మాణం, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ర.భ.శాఖ పనుల తీరు, ప్రగతి గురించి తెలుసుకున్నారు. డీఎల్‌డీవో రమేష్‌రామన్, డీఈఈ రత్నకుమార్, ఏఈలు చిరంజీవులు, చంద్రమౌళి, ఏపీడీలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడుగా మమ్ముల

సీతానగరం, న్యూస్‌టుడే: ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా సీతానగరానికి చెందిన మమ్ముల విశ్వేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ నెల 6న బాధ్యతలు చేపట్టనున్నట్లు చెప్పారు. పార్వతీపురం ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు.

ఈ పంట నమోదు పరిశీలన

బలిజిపేట: రైతులు ఈ పంటలో వివరాలు నమోదు చేసుకోవాలని ఏవో శ్రావణ్‌కుమార్ సూచించారు. వెంగాపురం, చిలకలపల్లి గ్రామాల్లో పంటలను దస్త్రాల ఆధారంగా పరిశీలించి వివరాలను నమోదు చేశారు. రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారులు ఉన్నారు.

పూరీ విమానాశ్రయం పనులిక వేగవంతం

స్థలం పరిశీలించిన మంత్రి బిభూతి



విమానాశ్రయం నమూనా

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీలోని సిపా సొరుబలి వద్ద ప్రతిపాదనలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయం పనులు పుంజుకోనున్నాయి. వాణిజ్య, రవాణా శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా శుక్రవారం సిపా సొరుబలి పరిశీలించారు.

ఇదివరకే కేంద్రం ఆమోదం: గత ప్రభుత్వం పూరీలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు నిర్ణయించింది. నాటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రధాని నరేంద్రమోదీతో దీనిపై స్వయంగా మాట్లాడారు. దీనికి కేంద్రం ఆమోదించింది. విమానయాన శాఖ యంత్రాంగం స్థలం సేకరణకు రాష్ట్రాన్ని కోరింది. అనంతరం సిపాసొరుబలి వద్ద 1,164 ఎకరాలను సేకరించారు. కేంద్ర బృందం పరిశీలించి నిర్మాణానికి ఆమోదయోగ్యంగా ఉందని నిర్ధారించింది. ఇంతలో ఎన్నికల భేరీ మోగడంతో పనులు ఆగాయి. అనంతరం భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. శుక్రవారం మంత్రి బిభూతి పూరీ సందర్శించి పరిస్థితి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం విమానాశ్రయం నిర్మాణానికి కట్టుబడి ఉందన్నారు. డబుల్ ఇంజిన్ పాలనలో శ్రీ జగన్నాథ్ విమానాశ్రయం తూర్పు తీరానికి కీలకం కానుందన్నారు. రెవెన్యూమంత్రి సురేష్ పూజారి మాట్లాడుతూ స్థల సేకరణ ఇదివరకే జరిగినందున పనులు ప్రారంభించడానికి ఇబ్బందులు లేవన్నారు. నిర్మాణ వ్యయం, కేంద్రం కేటాయింపుల పరిశీలన తరువాత పనులు పుంజుకుంటాయన్నారు. తొలుత పూరీ, భువనేశ్వర్‌ల నుంచి రహదారుల పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి ముందుగా మరోసారి కేంద్ర బృందం పరిశీలనకు వస్తుందని చెప్పారు.

ఇన్నాళ్లూ కొండలపై రహదారుల నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించడమే తప్ప పైసా విదల్చలేదు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎం జన్‌మన్ పథకంలో వెనుకబడిన సవర, గదబ తెగలు నివసిస్తున్న గిరిజన గ్రామాలకు దారి చూపించాయి.

– న్యూస్‌టుడే, పార్వతీపురం


దారి చూపిన.. జన్‌మన్



ఇది కొమరాడ మండలం అర్తాం-గుణానుపురం రహదారి నుంచి సీతామాంబపురానికి వెళ్లే మార్గం. పూర్తిగా రాళ్లు తేలిపోయింది. పీఎం జన్‌మన్‌లో నిధులు కేటాయించడంతో త్వరలో మోక్షం కలగనుంది.

- పీవీటీజీ గ్రామాలకు 21 రహదారులు
- రూ.55.83 కోట్లు మంజూరు

జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 21 గ్రామాలకు, సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని పలాస, పాతపట్నం, మెళియాపుట్టి, మందస మండలాల్లో ఆరు రహదారులకు నిధులు వచ్చాయి. కేంద్రం 60 శాతం.. రాష్ట్రం 40 శాతం నిధులు భరించి రహదారులు వేయనున్నాయి. ప్రధానంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, మక్కువ మండలాల్లో 15 రహదారులకు మోక్షం కలుగుతుంది. కురుపాం మండలంలో కొండలపై ఉన్న మార్గాలకు ప్రాధాన్యం లభించింది. విజయనగరం జిల్లాలోని మెంటాడ, వేపాడ, శృంగవరపుకోట మండలాల్లో మూడు రోడ్లు వేయనున్నారు. ఇందులో శృంగవరపుకోట మండలంలో 10.40 కి.మీ. పొడవున్న ఒకే దారికి నిధులు మంజూరు చేయడం విశేషం.



కురుపాం మండలం తిత్తిరి - గూనగూడ రోడ్డు ఇది. దీనిపై నడక నరకప్రాయం. ఇన్నాళ్లు ప్రతిపాదనలే తప్ప మంజూరు లేదు. ఇప్పుడు నిధులు వచ్చాయి.

ఏ మార్గానికి ఎంత కేటాయించారు?

మండలం	ఎక్కడి నుంచి ఎక్కడికి	నిధులు (రూ.లక్షల్లో)	నిర్వహణకు
గుమ్మలక్ష్మీపురం	తోబన - మండగూడ	79.00	5.93
"	పి.ఆమిటి - కె.పాలవలస	47.00	8.78
జియ్యమ్మవలస	జియ్యమ్మవలస-పసుపువానివలస	165.00	12.38
కొమరాడ	అర్తాం రోడ్డు-సీతమాంబపురం	59.97	4.27
కురుపాం	గుజ్జువాయి - డేరింగుపాడు	284.00	21.30
"	జుంబిరి - కేదారిలంక	159.50	11.90
"	తిత్తిరి రోడ్డు-గాలిమానుగూడ	281.00	21.07
"	తిత్తిరి రోడ్డు- పులిపుట్టు	127.00	9.53
"	తిత్తిరి - గూనుగూడ	169.00	12.67
"	తిత్తిరి - ఎగువపులిపుట్టి	446.00	33.45
"	నాయుడుగూడ- సంధిగూడ	402.00	30.15
"	రాముడుగూడ-బొడ్డుగాడిగూడ	295.00	22.13
"	సంధిగూడ - సాలిడంగు	222.00	16.65
"	పులిపుట్టి - గుమ్మిడిగూడ	250.00	18.74
మక్కువ	చెముడు - సీహెచ్ పాలికవలస	240.00	6.60
మెంటాడ	కె.లింగాలవలస-గాజులగుడ్డివలస	235.00	7.94
ఎస్‌కోట	వీఏఏ రోడ్డు-గునపాడు	1130.00	35.00
వేపాడ	కె.ఆర్.పురం-గదబవలస	265.00	10.40
సీతంపేట	రోలుగుడ్డి జం.-కోడిపిల్లగూడ	154.00	11.50
"	తుంబకొండ - సంధిగూడ	144.00	10.80
"	పూతికవలస- మూడగూడ	85.00	6.38

నిర్వహణకూ పైసలు: ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 54.25 కిలోమీటర్ల పొడవున రహదారులు వేయడానికి రూ.55.83 కోట్లు వెచ్చించడంతో పాటు ఐదేళ్ల నిర్వహణకు రూ.54.25 లక్షల నిధులు ఇచ్చారు. ఒక పార్వతీపురం మన్యం జిల్లాలో రహదారులకు రూ.52,03,42,000 మంజూరు చేశారు. ఇందులో కేంద్ర వాటా రూ.2996.38 లక్షలు కాగా.. రాష్ట్ర వాటా రూ.2207.09 లక్షలు.

నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రింగురోడ్డు సమీపంలోని మాంసం దుకాణానికి వెళ్లి మూడు కిలోలు కొన్నారు. తూకం తేడా కనిపించడంతో పక్కనే ఉన్న మరో దుకాణానికి వెళ్లగా.. రెండున్నర కిలోలే వచ్చింది. తిరిగి వెళ్లి అడిగితే దుకాణ యజమాని వాగ్వాదానికి దిగాడు.

నగరానికి చెందిన ఓ వ్యక్తి లీటరు పాల ప్యాకెట్లను రెండు కొన్నారు. ముద్రించిన ధర కన్నా అదనంగా రూ.4 తీసుకున్నారు. ప్రశ్నించగా.. అలా అమ్మితేనే తమకు గిట్టుబాటు అవుతుందని వ్యాపారుస్థుడు చెప్పుకొచ్చాడు. బొబ్బిలి, గంట్యాడలోనూ అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

అడిగినంత కాదు.. ఇచ్చినంత తీసుకోండి

- తూకాల్లో తేడాలపై పెద్దఎత్తున కేసులు
- తనిఖీలు అంతంత మాత్రమే




తూకపు రాళ్ల బరువులు చూస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ఉమ్మడి జిల్లాలో నిత్యం మార్కెట్లో వినియోగదారులకు ఎదురవుతున్న సమస్యలివి. తూకాల్లో లోపాలు, అధిక ధరలకు అమ్మకాలతో ఫిర్యాదులు పెరుగుతున్నాయి. చిన్నపాటి దుకాణాల నుంచి పెద్దపెద్ద మార్టుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరు అధికారులకు ఫిర్యాదు చేస్తుండగా.. మరికొందరు తమకెందుకని మిన్నకుండిపోతున్నారు. ఈక్రమంలో అక్రమాలు పెరుగుతునాయి.

ఇవి చూడాల్సిందే.. ● తూకాన్ని తప్పనిసరిగా గమనించాలి ● బిల్లు తీసుకోవాలి ● దానిపై ఉన్న ధరకు.. వస్తువుపై ఉన్నదానిని సరిపోల్చాలి ● ఇంటికి వెళ్లి సరకు నాణ్యతను చూసుకోవాలి ● తయారీ, వినియోగపు తేదీలున్న వాటినే కొనాలి ● తూనికల అడుగు భాగాన లీగల్ మెట్రాలజీ అధికారుల ముద్ర పరిశీలన తప్పనిసరి

ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు

జిల్లా	కేసులు	జరిమానాలు(రూ.లక్షల్లో) ముద్రణ	అపరాధ
విజయనగరం	91	16.26	6.53
పార్వతీపురం మన్యం	23	3.75	1.30



తనిఖీలు ఇలా.. తూకం రాళ్లు, ఎలక్ట్రానిక్ కాటాలకు సీళ్లు వేయడం, ప్యాకెట్లు, సీసాలపై ముద్రించిన ధరలకు విక్రయించేలా చూడటం, వివరాలు, చిరునామా కనిపించకపోతే జరిమానాలు విధించడం

సంప్రదించాల్సిన చరవాణి నంబర్లు

అసిస్టెంటు కంట్రోలర్	: 99516 86789
విజయనగరం ఇన్‌స్పెక్టర్	: 90008 28467
బొబ్బిలి ఇన్‌స్పెక్టర్	: 93981 31790
పార్వతీపురం మన్యం	: 94419 62429
టోల్ ఫ్రీ నంబరు	: 18004254202

సిబ్బంది కొరత..

వాస్తవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపార సముదాయాలకు తగ్గట్టుగా తూనికల కొలతల శాఖలో సిబ్బంది లేరు. కేవలం ఇన్‌స్పెక్టర్లతోనే నెట్టుకొస్తున్నారు. ఆకస్మిక తనిఖీలకు వెళ్లేటప్పుడు సంబంధిత వ్యాపారస్థుల నుంచి ప్రతిఘటన ఎదురైతే ఎదుర్కొనే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ప్రస్తుతానికి రెండు జిల్లాల పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఒక జిల్లా అధికారి ఉన్నారు. కిందిస్థాయి సిబ్బంది పది మంది కూడా లేరు.

అప్రమత్తత అవసరం..

వినియోగదారులు అప్రమత్తంగా ఉంటే మోసాలను అరికట్టవచ్చు. ఎలాంటి లోపాలు కనిపించినా మా దృష్టికి తీసుకురావొచ్చు. సిబ్బంది తక్కువగా ఉన్నా విధి నిర్వహణలో రాజీ పడడం లేదు. తరచూ దాడులు చేస్తున్నాం. పెద్దఎత్తున కేసులు నమోదు చేస్తున్నాం.

– రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్, తూనికలు– కొలతల శాఖ, విజయనగరం

ఆరోగ్య సేవలు అందేదెప్పుడో?

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 3 లక్షల మంది ప్రజలు నివాసముంటున్నారు. రోజూ వివిధ అవసరాల నిమిత్తం నగరానికి 40 వేల మంది వరకు వస్తుంటారు. వీరందరికీ మహారాజా, ఘోషా, ఇతర చిన్న ఆసుపత్రుల నుంచి మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి వస్తే మరింత మందికి లబ్ధి చేకూరుతుంది. అయితే గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ నిర్మాణ పనులు ముందుకు కదలడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. పునాదులకే పరిమితం కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏడు కేంద్రాల మంజూరు..

నగరంలో ఏడు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈమేరకు రూ.80 లక్షల చొప్పున రూ.5.60 కోట్లు మంజూరు చేశారు. నగర పాలక సంస్థ నుంచి అదనంగా రూ.1.62 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సొమ్మును కేఎల్‌పురంలోని నిర్మాణానికి రూ.21.73 లక్షలు, ప్రశాంతినగర్- రూ.20.15 లక్షలు, వీటీ అగ్రహారం- రూ.25.84 లక్షలు, ఎల్‌బీనగర్- రూ.23 లక్షలు, కొత్తపేట- రూ.24.22 లక్షలు, స్టేడియంపేట- రూ.23.21 లక్షలు, గాజులరేగలో ఏర్పాటుకు రూ.23.91 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం కొత్తపేట, గాజులరేగ, వీటీఅగ్రహారంలో మాత్రమే పూర్తి చేశారు. స్టేడియంపేట, ప్రశాంతినగర్‌లో నిర్మాణ దశలో ఉండగా, కేఎల్‌పురం, ఎల్‌బీ కాలనీలో ప్రారంభోత్సవాలు జరిగినా వినియోగంలోకి రాలేదు.



ప్రశాంతినగర్‌లో తుప్పల మధ్య పట్టణ ఆరోగ్య కేంద్రం పునాదులు

ఇదీ పరిస్థితి..

ప్రశాంతినగర్ (ఇస్మాయిల్ కాలనీ)లో పనుల పూర్తికి సాధారణ నిధుల నుంచి రూ.35 లక్షలు మంజూరు చేయాలని, కొత్తగా టెండర్లు పిలవాలని ఇటీవల జరిగిన సాధారణ సమావేశంలో సభ్యులు లేవనెత్తారు. ఈమేరకు అజెండాలో అంశంగా చేర్చారు. ఏడు కేంద్రాల్లో గత ప్రభుత్వ హయాంలో ఇక్కడి నిర్మాణానికే తొలుత శంకుస్థాపన జరిగింది. నాలుగేళ్లవుతున్నా ఇంకా పూర్తికాలేదు.

చర్యలు తీసుకుంటాం..

స్టేడియంపేటలో నిర్మాణానికి కొత్తగా టెండర్లు పిలిచి గుత్తేదారుకు వర్క్ ఆర్డరు ఇచ్చాం. పనులు ప్రారంభించకపోవడంతో నోటీసు కూడా అందించాం. ప్రశాంతి నగర్‌లో ప్రారంభానికి మరో రూ.35 లక్షలు అవసరమని భావిస్తున్నాం. కేఎల్‌పురం, ఎల్‌బీ కాలనీల్లో త్వరలోనే సేవలు అందేలా చూస్తాం.

- కె.శ్రీనివాసరావు, ఈఈ, నగర పాలక సంస్థ

వాహనాలు ఢీ.. ఒకరి మృతి

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని కంభంపాడు పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై సీహెచ్.కృష్ణ తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని కంచికచర్ల మండలం దొనబండకు చెందిన షేక్ అబ్దుల్‌రఫీ(40) ఒడిశాలోని ఒక క్రషర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తన బొలెరో వాహనంలో ఒడిశా నుంచి స్వస్థలమైన దొనబండ వస్తుండగా మధ్యాహ్నం గుంటూరు నుంచి తిరువూరుకు వెళుతున్న స్కార్పియో వాహనం ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో అబ్దుల్ రఫీకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి భార్య మహాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



షేక్ అబ్దుల్‌రఫీ మృతదేహం

చెరకు తోట దగ్ధం

సీతానగరం: మండలంలోని నీలకంఠాపురం రెవెన్యూలో శుక్రవారం రాత్రి 5 ఎకరాల్లో చెరకు తోట అగ్నికి ఆహుతయ్యింది. పది మంది రైతులకు సంబంధించిన పంట కాలిపోవడంతో ఆవేదన చెందుతున్నారు. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వీఆర్వో శ్రీనివాసరావు చెప్పారు.

కేరండి నదిలో జల కళ


సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్-సునాబెడ మార్గంలో ఉన్న కేరండి నది జల కళ సంతరించుకుంది. వేసవిలో పూర్తిగా ఎండిపోయింది. గత నాలుగు నెలల్లో కురిసిన వర్షాలకు నదిలో నీరు పెరిగింది. జలవిద్యుత్తు (పవర్ ప్లాంట్ ఎగువ కొలాబ్ ప్రాజెక్టు), నీటి పారుదలకు (జయపురం), పట్టణాల మంచి నీటి సరఫరా(సునాబెడ, కొరాపుట్, దమన్‌జోడి) ఈ నది ఆధారం.




నిండిన నది

రక్తదానానికి ముందుకు రావాలి: కురుపాం గ్రామీణం: యువత రక్తదానానికి ముందుకు రావాలని మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ కుమార్‌దేవ్ పిలుపునిచ్చారు. శనివారం కురుపాంలో వాయుపుత్ర సేవాసంఘం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

కాస్త పరిచయాన్ని ఆసరాగా చేసుకుని బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కొందరు అమాయకులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడి లొంగదీసుకుంటున్నారు. ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల స్థాయి విద్యార్థినులే ఎక్కువగా బాధితులవుతున్నారు. ఉజ్వల భవిష్యత్తును చూడాల్సిన వారు బయటకు రాలేక ఇంటికే పరిమితమవుతున్నారు. కొన్ని ఉదంతాలు పోలీసుస్టేషన్ వరకు వెళ్లి కేసులు నమోదవుతుండగా మరికొన్ని వెలుగులోకి రావడం లేదు. తల్లిదండ్రులు చెడు, మంచి స్పర్శల మధ్య తేడాను వివరించి అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు.





తెలిసినోళ్లే కీచకులు..!

- కాస్త పరిచయంతో నయవంచన
- బాలికలు అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

ఎచ్చెర్ల, శ్రీకాకుళం నేరవార్తవిభాగం, న్యూస్‌టుడే

● ఎచ్చెర్ల మండలంలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని అదే పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు గత నెలలో ఆమె భుజాన్ని తాకుతూ ఐ లవ్ యూ చెప్పాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. వారు పాఠశాలకు వచ్చి ప్రశ్నించడంతో అతను కావాలని చేయలేదని క్షమాపణ కోరాడు.

● సారవకోట మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమెతో ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకుని అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు గత నెల 16న మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంపై భావనపాడు బీచ్‌కు తీసుకెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చిన బాలిక కడుపులో నొప్పిగా ఉందని తల్లికి చెప్పింది. ఆమె గట్టిగా ప్రశ్నించడంతో ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది.

● ఎచ్చెర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు (ఇంటర్ విద్యార్థిని) అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో మూడు నెలల కిందట పరిచయమైంది. వివాహం చేసుకుంటానని చెప్పి శారీరకంగా దగ్గరయ్యాడు. ఆమె గర్భం దాల్చిన విషయం బయటకు పొక్కింది. అతను తనకు సంబంధం లేదని తప్పించుకోవడంతో ఆ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది.

● రణస్థలం మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఆమెకు మాయమాటలు చెప్పి లొంగదీసుకోవడంతో గర్భం దాల్చింది. తనకు సంబంధం లేదని అతను చెప్పడంతో బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

.. ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. కొందరు పరిచయాన్ని ఆసరాగా తీసుకుని ప్రేమ పేరిట మాయమాటలు చెబుతున్నారు. నమ్మించి ఏకాంత ప్రదేశాలకు తీసుకెళ్లి దారుణాలకు ఒడిగడుతున్నారు.


తల్లిదండ్రులు ఇలా చేస్తే మేలు

● అమ్మాయిలకు మంచి, చెడు స్పర్శ వంటి విషయాలపై అవగాహన కల్పించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
● రోజూ పిల్లలతో కొంత సమయం మాట్లాడి వారి దినచర్య, ఎవరెవరితో మాట్లాడుతున్నారనే అంశాలు తెలుసుకుని అప్రమత్తం చేయాలి.
● ఎవరితోనైనా అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే వారి గురించి ఇంట్లో చెప్పాలని సూచించాలి. చేదు అనుభవం ఎదురైతే నెమ్మదిగా సమస్య తెలుసుకుని పరిష్కరించాలి.

ఉపాధ్యాయినులదే కీలక పాత్ర

లైంగిక దాడులకు గురవుతున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాలికలే ఎక్కువగా ఉంటున్నారు. ఉపాధ్యాయినులు చొరవ తీసుకుని సమాజంలో చోటుచేసుకుంటున్న దారుణ ఉదంతాలను వారికి అర్థమయ్యేలా వివరించాలి. ఇతరులు ఎక్కడ తాకితే ఎలా స్పందించాలో తెలియజేసి చైతన్యపరచాలి. అతిక్రమిస్తే తక్షణం వ్యతిరేకించే పద్ధతులను నేర్పాలి.

పిల్లలపై పర్యవేక్షణ అవసరం..



పిల్లలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. పాఠశాలలో నైతిక విలువలు నేర్పడం, నీతి కథలు బోధించడం, క్రీడల్లో భాగస్వాములను చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. బాలికలపై అఘాయిత్యాలకు సంబంధించి సత్వరం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నాం.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యం..



తల్లిదండ్రులు, పలు విద్యాసంస్థల ప్రతినిధులు చదువుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ విధానం మారాలి. ఇంటి వద్ద తాత, అమ్మమ్మ, ఇతర కుటుంబ సభ్యులతో పిల్లలు గడిపేలా తల్లిదండ్రులు చూడాలి. గంజాయి, మత్తు పదార్థాలు, పోర్న్ వీడియోలు దారుణాలకు కారణమవుతున్నాయి. వాటిని నియంత్రించి విలువలతో కూడిన విద్య, మానవ సంబంధాలను పెంపొందిస్తే అఘాయిత్యాలకు అడ్డుకట్ట పడుతుంది.

- డా.జేఎల్ సంధ్యారాణి, మనస్తత్వ శాస్త్రం ఆచార్యులు, డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

క్లోరిన్ గ్యాస్ లీక్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని చందకా పారిశ్రామిక వాడలో శివం క్లోరిన్ గ్యాస్ కంపెనీలో శనివారం రాత్రి 8.30 గంటలకు గ్యాస్ లీకైంది. కొన్నాళ్ల నుంచి ఈ కంపెనీ మూతపడి ఉంది. గడువు తేదీ ముగిసిన ట్యాంకుల నుంచి గ్యాస్ వెలువడింది. స్థానికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. అగ్నిమాపకశాఖ ఐజీ దీపక్‌కుమార్ పర్యవేక్షణలో అయిదు అగ్నిమాపక బృందాలు చందకా నుంచి ఇన్ఫోసిటీ వరకూ రహదారిపై రాకపోకలు లేకుండా చూశాయి. ఆక్సిజన్ మాస్కులు ధరించిన జవానులు లీకైన ట్యాంకులను వెలుపలికి తెచ్చారు. వాటిని నిర్వీర్యం చేశారు. తర్వాత వాహనాల రాకపోకలకు అనుమతించారు. 9.15 గంటల తర్వాత పరిస్థితి పూర్తిగా నియంత్రణలోకి వచ్చినట్లు దీపక్‌కుమార్ విలేకరులకు చెప్పారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా ఆర్యస్‌గ్రేసకు అవార్డు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వాలీబాల్ సంఘం అధ్యక్షుడు డా॥ ఆర్యస్‌గ్రేసకు భువనేశ్వర్‌లోని కిస్ విశ్వవిద్యాలయం 'మానవతావాది' అవార్డు అందజేసింది. శుక్రవారం రాత్రి వర్సిటీలో జరిగిన వేడుకలో గవర్నరు రఘుబర్ దాస్ ఈ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, 'కిస్' విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డా॥ అచ్యుత సామంత పాల్గొన్నారు.



ఆర్యస్‌ను సత్కరిస్తున్న గవర్నరు. పక్కన సింగ్‌దేవ్, అచ్యుత సామంత

ఈ పంటలో నమోదు తప్పనిసరి

సీతానగరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా సాగవుతున్న అన్ని పంటల వివరాలు ఈ-పంటలో నమోదు కావాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సీతానగరం మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. కాశాపేట రెవెన్యూలో పొలాలకు వెళ్లి ఈ-పంట నమోదు పునఃపరిశీలన చేశారు. అధికారుల నుంచి వివరాలు సేకరించారు. చిన భోగిలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సరకుల దస్త్రాలు, నిల్వలు సరిచూశారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.

పాత్రికేయ రంగ దిగ్గజం గోపబంధు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బహుముఖ ప్రజ్ఞాశాలి ఉత్కళమణి గోపబంధు దాస్ పాత్రికేయ రంగంలో దిగ్గజమని, ఆ మహనీయుడు స్థాపించిన 'సమాజ్' పత్రిక రాష్ట్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు గవర్నరు రఘుబర్‌దాస్ చెప్పారు. కటక్‌లో 'సమాజ్' 105 వసంతాల ఆవిర్భావ వేడుక శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా గవర్నరు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పత్రిక సిబ్బంది పాల్గొన్నారు.



గోపబంధు విగ్రహం వద్ద దీపం వెలిగిస్తున్న రఘుబర్. పక్కన పత్రికా సిబ్బంది